సాక్షి
రంగారెడ్డి

బుధవారం : 15 : నవంబర్ : 2023



పొలిటికల్ యుద్ధం
ఒక్కప్పుడు యోగ క్షేమాలు తెలుసుకు నేందుకు వినియోగించే మొబైల్ ఫోన్ నేడు ప్రతీ పనికి ప్రధానాధారమైంది. 10లో▸



సర్వేశా నీవే దిక్కు!
వనస్థలిపురానికి చెందిన ఒక వ్యాపారవేత్త ఓ ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపు అవకాశాలపై సర్వే చేపట్టారు. 10లో▸



ఒకే ఇంట్లో 125 ఓట్లు
ఈఆర్ఓల నుంచి బూత్ లెవల్ అధికారుల వరకు ఓటరు జాబితాలను పరిశీలించారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 10లో▸

న్యూస్‌రీల్

పోలింగ్ ఏజెంట్లపైనా ఆరా

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్న పోలీసు విభాగం ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలిస్తోంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ప్రతినిధులపైనా దృష్టి పెట్టింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉండేందుకు ఇది కూడా కీలకమని నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే నేరచరిత్ర కలిగి ఉన్న వారిని పోలింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ప్రతినిధులుగా ఉండకూడదనే నిబంధనను పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది. రాజకీయ పార్టీల నుంచి వీరి జాబితా అందిన తర్వాత వ్యక్తిగత పూర్వాపరాలు పూర్తిస్థాయిలో ఆరా తీయాలని అధికారులకు స్పష్టం చేసింది.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల్లో భాగంగా ఈ నెల 15 నుంచి ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పు (వీఐఎస్)లను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ భారతి హోళీకేరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 15 నుంచి 22 వరకు, ఎల్బీనగర్‌లో 15 నుంచి 20 వరకు, శేరిలింగంపల్లిలో 15 నుంచి 23 వరకు ఓటరు స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి 'జైభారత్ జస్ట్ ఓట్'

లక్డీకాపూల్: ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టడానికి విచ్చలవిడిగా డబ్బు పంచడం బహిరంగ రహస్యమేనని జైభారత్ జస్ట్ ఓట్ తెలంగాణ క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల పేర్కొన్నారు. నాయకులు ఓటర్లకు డబ్బులు యథేచ్ఛగా పంచి ఓట్లు కొల్లగొట్టుకు పోతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితిని మార్చేందుకు జైభారత్ సంస్థ 15 ఏళ్లుగా 'జస్ట్ ఓట్' ఉద్యమాన్ని చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకర్గాల్లోనూ 'ఓటు అమ్ముకోవద్దు' అని ప్రజలను చైతన్యం చేసేందుకు జైభారత్ 'జస్ట్ ఓట్ క్యాంపెయిన్' ఈ నెల 15న ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగానికి ఉత్సాహంగా ఈలలు వేస్తున్న కార్యకర్తలు



పథకాలు కావాలంటే బీఆర్ఎస్ రావాలి

సీఎం ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్

- గులాబీమయమైన ఇబ్రహీంపట్నం
- భారీగా తరలివచ్చిన జనం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ విజయవంతమైంది. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో పట్టణం గులాబీమయమైంది. కార్యకర్తలు, అభిమానులు, జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కేసీఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. పార్టీ కేడర్‌లో జోష్ నింపింది. ప్రభుత్వం పథకాలు సక్రమంగా అమలు కావాలంటే మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ రావాలని.. ఇబ్రహీంపట్నంలో మంచి జరగాలంటే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని సీఎం ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు వేయొద్దని, కారు గుర్తుకు ఓటేస్తే అందరూ సుఖసంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు.



సీఎం కేసీఆర్‌కు సచివాలయం నమూనా జ్ఞాపికను బహూకరిస్తున్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి తదితరులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చొరవతో రూ.2,931 కోట్లతో ఇబ్రహీంపట్నంను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తామన్నారు. రూ.15 కోట్లతో ఇబ్రహీంపట్నం పెద్ద వాగు బాగుచేయడం ద్వారా నేడు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండిందన్నారు. 84వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో శివన్నగూడ ప్రాజెక్టు సిద్ధమైందని ఇప్పటికే డీపీఆర్ పూర్తి చేశారని తెలిపారు. సాగునీరందించాలని ముఖ్యమంత్రిని కోరారు. సాగర్ రహదారిని నాలుగులేన్ల రోడ్డు చేయాలని విన్నవించారు. శంషాబాద్ నుంచి పెద్దంబర్‌పేట్ మీదుగా బొంగ్లూర్ వరకు మెట్రో రైలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు కేశవరెడ్డి, మంత్రి సబితారెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలు చేయొద్దు

- ఎన్నికల విధులు పక్కాగా నిర్వర్తించాలి
- పరిపూర్ణమైన అవగాహన అవసరం
- కలెక్టర్ భారతి హోళీకేరి

ఇబ్రహీంపట్నం రూరల్: పరిపూర్ణమైన అవగాహనతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని కలెక్టర్ భారతి హోళీకేరి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని శేరిగూడ శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హోళీకేరి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, చిన్న తప్పిదానికి కూడా ఆస్కారం కల్పించకూడదని తెలిపారు. నిబంధనలు ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా పాటించాలన్నారు. మాక్‌పోలింగ్ నిర్వహించిన తరువాత తప్పనిసరి డేటా డిలీట్ చేయాలని, ఈవిషయాన్ని ప్రతి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన మీదట ఎన్ని ఓట్లు పోలయ్యాయి అనే వివరాలను జాగ్రత్తగా సరిపోల్చుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ఓటింగ్ యంత్రాల్లో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. మాక్ పోల్ సమయంలో సాంకేతిక సమస్య ఏర్పడినప్పుడు సంబంధిత యంత్రాన్ని మాత్రమే మార్చాలన్నారు. పోలింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్క దానిలో సమస్య తలెత్తినా సీయూ, బీయూలను మార్చాలన్నారు.

ఓటర్‌గైడ్ బుక్ రిలీజ్

ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ భారతి హోళీకేరి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్‌తో కలిసి ఓటరుగైడ్ బుక్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళీకేరి

రాష్ట్రంలో దుర్మార్గపు పాలన



షాద్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- ఉద్యమకారుల త్యాగాలతోనే తెలంగాణ
- ప్రత్యేక రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు
- షాద్‌నగర్ బీజేపీ విజయగర్జన సభలో ఈటల రాజేందర్

షాద్‌నగర్: రాష్ట్రంలో కొనసాగుతున్న దుర్మార్గపు పాలన అంతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం షాద్‌నగర్‌లో పార్టీ అభ్యర్థి అందె బాబయ్య ఆధ్వర్యంలో బీజేపీ విజయ గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఆత్మత్యాగాల ఫలితంగానే తెలంగాణ వచ్చిందన్నారు. ఉద్యమ సమయంలో తనపై కూడా కేసులు పెట్టడంతో మహబూబ్‌నగర్ జైల్లో ఉన్నానని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పేదల నుంచి బలవంతంగా భూములు లాక్కొని పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తోందని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చారన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.4,250కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రజలను కలవడం లేదని, ప్రగతి భవన్, ఫాంహౌస్‌లకు మాత్రమే పరిమితమయ్యాడని ఎద్దేవా చేశారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.బీసీల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేందుకు డబ్బు సంచులతో కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, అందెబాబయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కమలం.. కదనోత్సాహం

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్ప సభ నిర్వహించారు. పట్టణ శివారులోని బాలాజీ టౌన్‌షిప్ సమీపంలో నిర్వహించిన సభకు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరయ్యారు. జిల్లా నాయకులతో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సభకు జనం పెద్ద ఎత్తున తరలిరావడం.. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఈటల మాటలతూటాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాయి. ప్రజా సేవ చేయడానికి మనిషి ఆరడుగుల ఎత్తు, డబ్బు అవసరం లేదని, మంచి హృదయం ఉండాలని అన్నారు. మన తలరాత మారడానికి ఏకైక ఆయుధం ఓటు మాత్రమేనని, అలాంటి ఓటును అమ్ముకోవద్దని హితవుపలికారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కమలం పువ్వుకు ఓటువేసి అందెబాబయ్యను గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌ను నమ్మొద్దు..

పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన బీఆర్ఎస్‌ను నమ్మకుండా దేశాభివృద్ధికోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీజేపీకి పట్టం కట్టాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. దేశంలో ప్రధాని మోదీ సుపరిపాలనలో దేశం ఎంతో సుభిక్షంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం దక్కాలనే ఆలోచనతో సామాజిక తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ అబద్ధాల పాలనలకు కాలం చెల్లిందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అందె బాబయ్యను గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయరాజు, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్, జిల్లా ప్రచార కార్యదర్శి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ సిటీ

రేపటి నుంచి కేటీఆర్ రోడ్‌షోలు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రచారానికి దాదాపు రెండు వారాలు మాత్రమే గడువుంది. ఈలోగా విస్తృత ప్రచారానికి అధికార బీఆర్ఎస్ సిద్ధమైంది. గ్రేటర్ హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ముఖ్యంగా మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ ఏ మాత్రం అవకాశం దొరికినా, ఏ స్వల్ప సమయం లభించినా గ్రేటర్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా వివిధ సమావేశాలతోపాటు విస్తృత రోడ్‌షోలకూ ప్రణాళిక సిద్ధం చేశారు.

రోడ్‌షోలు ఇలా..

- 16వ తేదీ: సాయంత్రం 5 గంటలకు కూకట్‌పల్లిలో, రాత్రి 7 గంటలకు కుత్బుల్లాపూర్‌లలో రోడ్‌షోల్లో పాల్గొంటారు.
- 17వ తేదీ: సాయంత్రం 5 గంటలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రోడ్‌షోలో భాగంగా శ్రీరాం నగర్, యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. రాత్రి 7 గంటలకు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని జహీర్‌నగర్, హిమాయత్‌నగర్‌లలో రోడ్‌షోలో పాల్గొననున్నారు.



- 18వ తేదీ: సాయంత్రం 4 గంటలకు నాంపల్లి నియోజకవర్గంలో 5 గంటలకు గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్ చత్రి, పుత్లిబౌలిల్లో రోడ్‌షోల్లో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు సికింద్రాబాద్‌నియోజకవర్గంలోని శాంతినగర్, ఎస్‌వీఎస్ ప్రాంతాల్లో రోడ్‌షోలో పాల్గొంటారు.
- 19వ తేదీ: సాయంత్రం 5 గంటలకు అంబర్‌పేట నియోజకవర్గంలోని అలీకేఫ్, ఫీవర్ హాస్పిటల్ లేదా చప్పల్ బజార్‌లలో రోడ్‌షోలో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని రామ్‌నగర్ చౌరస్తా, భోలక్‌పూర్, గాంధీనగర్ కొత్తబ్రిడ్జి దగ్గర రోడ్‌షోల్లో పాల్గొంటారు.
- 20వ తేదీ: ఉప్పల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో రోడ్‌షోల్లో పాల్గొంటారు.

ట్రిపుల్ వన్.. ట్రబుల్స్!

త్రిశంకు స్వర్గంలో జీఓ 111



- ఎన్నికల వేళ సర్వత్రా చర్చ
- ఇప్పటికి రెండుసార్లు ఎత్తివేత
- అధికారికంగా కొనసాగుతున్న అమలు
- పీటీఆర్ఐ అనుమతుల నెపంతో నిర్మాణాలు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల ప్రచారం ఉద్ధృతంగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో 111 జీఓ ప్రధాన విషయంగా మారింది. ఈ జీఓపై ఏ పార్టీ ఎలాంటి వైఖరి తీసుకుంటుందని అటు రియల్ ఎస్టేట్ వర్గాలు, ఇటు రైతులు, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు దీనిపై ఎన్నికల్లో అనుకూలంగా, వ్యతిరేకంగా ఓటర్లు స్పందించే అవకాశం ఉంది. జీఓ అమలు వల్ల ఆంక్షలు కొనసాగుతున్న 82 గ్రామాలకు చెందిన రైతులు దీనిని ఎత్తివేయాలని కోరుతుండగా, జంట జలాశయాల పరిరక్షణకు దోహదం చేసేందుకు తప్పనిసరిగా కొనసాగించాలని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, పర్యావరణవేత్తలు, సామాజిక సంస్థలు, పలు రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. హైదరాబాద్ నగరాన్ని కాపాడేందుకు కూడా వరద నివారణ చర్యల్లో భాగంగా జీఓను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ జీఓపై ప్రధాన రాజకీయ పార్టీల వైఖరి ఎలా ఉండనుందనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ప్రభుత్వం 2022 నుంచి ఇప్పటి వరకు ఈ జీఓను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దీని స్థానంలో 69 జీఓను తెచ్చారు. కానీ ఇది అమల్లోకి రాలేదు. జీఓ 111 ఎత్తివేస్తున్నట్లు మంత్రి మండలిలో తీర్మానం చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ సాంకేతికంగా ఇది అమల్లోకి రాలేదు. జీఓ 111 ఆంక్షలు యథావిధిగా కొనసాగుతున్నట్లు మరో రెండు సార్లు ప్రభుత్వం కోర్టు దృష్టికి తెచ్చింది. దీంతో ప్రస్తుతం ఈ జీఓ పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది.

ఇదీ నేపథ్యం..

జంట జలాశయాలను కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు 1996 మార్చి 8వ తేదీన అమల్లోకి తెచ్చిన జీఓ 111 వల్ల 82 గ్రామాల్లోని సుమారు 1.32 లక్షల భూముల్లో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకుండా ఆంక్షలు విధించారు. కాలుష్య కారకాల నుంచి, వివిధ రకాల వ్యర్థాల నుంచి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను కాపాడేందుకు వాటి పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో ఎలాంటి నివాసాలు, హోటళ్లు, పరిశ్రమలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించకూడదు. రెండు నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికల ఆధారంగాలిది అమల్లోకి వచ్చింది. అనంతరం హైదరాబాద్ ఎన్జీఆర్ఐ, ఐఐటీ ముంబైకి చెందిన డాక్టర్ భౌమిక్, ఢిల్లీలోని ఎన్ఈఏఏ ఇచ్చిన మూడు శాస్త్రీయ నివేదికల ఆధారంగా సుప్రీంకోర్టు ట్రిపుల్ వన్ జీవోను సమర్థించింది.భావి తరాల అవసరాల కోసం జలాశయాలను కాపాడుకోవాల్సిన అవసరముందని చెప్పింది. ఆ జలాశయాల క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 10 కిలోమీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పింది.

పర్యావరణానికి హాని ఇలా..

- జలాశయాల నుంచి 10 కి.మీ వరకు ఉన్న నేలలు స్వభావరీత్యా డైక్ లాటరేట్ కేటగిరికి చెందినవి. వర్షాలకు కుంగిపోతాయి. అలాగే కాలుష్య కారకాలు ఈ నేలలో చేరితే త్వరగా వ్యాప్తి చెందుతాయి. దీంతో జలాశయాల్లోకి కాలుష్యం చేరి దెబ్బతింటాయి. అందుకోసం 10 కి.మీ వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు.
- ప్రస్తుతం జంట జలాశయాలు స్వచ్ఛమైన వర్షపు నీటితో నిండి ప్రజలకు అంతే స్వచ్ఛమైన నీటిని అందజేస్తున్నాయి. వర్షపు నీటిని సంరక్షించడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. గతంలో నిర్మించిన ఎస్టీపీలు, రింగ్‌మెయిన్‌లు ఈ చెరువులను కాపాడలేకపోయాయి. భవిష్యత్తులో జలాశయాలు దెబ్బతింటే చుట్టూ ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతాయి. దీంతో భూ తాపం పెరుగుతుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువవుతాయి. ఇది జీవావరణానికి ముప్పుగా పరిణమిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక నివాసయోగ్యత, సుస్థిరత ఉన్న హైదరాబాద్ నగరంలో ఇలా సహజ వనరులను విధ్వంసం చేయడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతో హాని చేసినట్లవుతుందని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి చెప్పారు.

యథేచ్ఛగా భారీ నిర్మాణాలు..

జీఓ 111 త్రిశంకు స్వర్గంలో పడిపోవడంతో యథేచ్ఛ ఆంక్షల ఉల్లంఘన కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమమంది రియల్టర్‌లు ప్రస్తుతం ఈటీపీఆర్ఐ అనుమతులతో హెచ్ఎండీఏ నుంచి భూ వినియోగ మార్పిడి (చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్) పత్రాలను పొందుతున్నారు. జీఓ 111 పరిధిలోకి వచ్చే వట్టినాగులపల్లి తదితర ప్రాంతాల్లో ఇలా భూ వినియోగ మార్పిడి అనుమతులు లభించిన భూముల్లో ప్రస్తుతం భారీ ఎత్తున భవన నిర్మాణాలు కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జీఓను పటిష్టంగా అమలు చేయాలి

నగరానికి తాగునీటిని ఇచ్చే జంట జలాశయాలను కాపాడేందుకే కాదు. జీవవైవిధ్య పరిరక్షణకు కూడా ఈ జీఓ ఎంతో ముఖ్యం. దీన్ని పటిష్టంగా అమలు చేయాలి. ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీలు ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించాలి. ఇది నగర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశం.

– లుబ్నా సార్వత్, సామాజిక కార్యకర్త



40 ఏళ్లు.. ఓటర్లు రెండింతలు



అంబర్‌పేట్: నాలుగు శతాబ్దాల క్రితంతో పోలిస్తే.. ప్రస్తుతం అంబర్‌పేట్ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య రెట్టింపు అయింది. 1985లో పూర్వ హిమాయత్ నగర్ నియోజకవర్గంలో భాగమైన అంబర్‌పేట్‌లో అప్పటి ఓటర్లు 1,34,381 మంది. ఇందులో పురుషులు 71,394, 62, 987 మంది మహిళలు. తాజాగా అంబర్‌పేట్‌లో 2,70,728 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,37,385, మహిళలు 1,33,332, ఇతరులు 11 మంది ఉన్నారు. 1985లో జరిగిన ఎన్నికల్లో ప్రధానంగా బీజేపీ అభ్యర్థి ఆలె నరేంద్ర, కాంగ్రెస్ అభ్యర్థి మేజర్ కె.ప్రభాకర్‌రెడ్డిలు తలపడ్డారు. ఈ ఎన్నికల్లో 52.79 శాతం పోలింగ్ జరిగింది. 18,588 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి ఆలె నరేంద్ర గెలుపొందారు.

సామాజిక మాధ్యమాల్లో పొలిటికల్ యుద్ధం

ఫోన్లు, ఇంటర్నెట్‌ల వాడకం పెరిగిన నేపథ్యంలో ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్ వేదికగా రాజకీయ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక సైన్యం సైతం పనిచేస్తోంది. అభ్యర్థులు, ప్రత్యర్థులు తమదైన శైలిలో దూసుకుపోతున్నారు.

- ప్రచారంలో దూసుకుపోతున్న రాజకీయ పార్టీలు
- అభ్యర్థుల తరుఫున పనిచేస్తున్న ప్రత్యేక సైన్యం



మంచాల: ఒకప్పుడు యోగ క్షేమాలు తెలుసుకునేందుకు మొబైల్ ఫోన్ నేడు ప్రతీ పనికి ప్రధానాధారమైంది. ప్రస్తుతం చరవాణి లేకుంటే చేయి విరిగినంత పని అవుతోంది. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు సెల్ నిత్యకృత్యమైంది. పెరిగిన సాంకేతికతతో కూర్చున్న చోటు నుంచే ప్రపంచాన్ని చుట్టేయొచ్చు. ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్న మొబైల్ ఫోన్ అంతే స్థాయిలో వినాశనాలకు ఉపయోగిస్తున్నారు. సెల్ ఫోన్ ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగించే వారిపై సైబర్ నేరాల నివారణ చట్టాలను సైతం తీసుకువచ్చింది.

ప్రధాన ప్రచారాస్త్రంగా మారిన సెల్‌ఫోన్

ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొబైల్ ఫోన్ ఓ ప్రధాన ప్రచార వేదికగా మారింది. ఎక్కడ ఏమి జరిగిన క్షణాల్లో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్తుంది. ప్రత్యర్థులు సైతం సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తమ ఎన్నికల ప్రచారాలతో పాటు ప్రత్యర్థులు మీద విమర్శలు గుప్పిస్తున్నారు. టీవీ చానళ్లు, దిన పత్రికలతో పాటు సోషల్ మీడియాకు తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

క్షణాల్లోనే వైరల్

రాజకీయ నాయకులు సోషల్ మీడియాపై దృష్టి సారించారు. ఓ ఓటర్లను ఆకట్టునేందుకు ప్రజల్లో ఉంటూనే ప్రత్యర్థుల ఆటకట్టించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తాము చేసిన పనులు ప్రజల్లోకి తీసుకొని పోవడంతో పాటుగా తమను విమర్శించే వారికి ఇదే వేదికగా సమాధానం చెబుతున్నారు. ఇందుకు ప్రత్యేకంగా సోషల్ మీడియా కార్యకర్తలను నియమించుకుంటూ వార్‌కు సమాయత్తం చేస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో పాటు ప్రత్యర్థుల పరపతి తగ్గించే పనులకు శ్రీకారం చుట్టుతున్నారు. ఇలా.. సోషల్‌మీడియాలో ప్రత్యర్థుల ఎన్నికల వార్ జోరుగా సాగుతోంది. గతంలో సభలు, సమావేశాలకు పరిమితమైన ఆరోపణలు, విమర్శలు చేసేవారు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నా లైవ్ పెట్టి మరీ తిప్పికొడుతున్నారు. సభలు, సమావేశాల వీడియోలు, ఫొటోలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి.

వాస్తవమా..? అవాస్తవమా..?

ఫోన్ ఆన్ చేస్తే చాలు వందల కొద్దీ ఎన్నికల ప్రచారాలకు సంబంధించిన ఫొటోలు, వార్తలు, ప్రత్యర్థి పార్టీలకు వ్యతిరేక వార్తలను సృష్టించి మరీ పెడుతున్నారు. ఏది వాస్తవం.. అవాస్తవం గుర్తించడం కష్టతరంగా మారింది. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. సోషల్ మీడియా వేదికగా కఠోర వాస్తవాలు వెలుగులోకి వచ్చినా.. మరికొన్ని సందర్భాల్లో అవాస్తవాలు సైతం చక్కర్లు కొడుతున్నాయి. ఏది ఏమైనా 'సోషల్ వార్' రాజకీయాలను వేడెక్కిస్తుంది.



వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకటేశ్ గౌడ్

అరగంటలో అటు.. ఇటు!

అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో కండువాల మార్పులు ఊపందుకున్నాయి. పట్టణానికి చెందిన ఓ లీడర్ అరగంట వ్యవధిలోనే రెండు పార్టీలు మారాడు. బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వన్నాడ వెంకటేశ్‌గౌడ్ మంగళవారం ఉదయం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కారు దిగి కాంగ్రెస్ అ భ్యర్థి శంకర్ సమక్షంలో పార్టీలో చేరారు. మరో అరగంట వ్యవధిలోనే తిరిగి ఆయన కేశంపేట ఎంపీపీ రవీందర్‌యాదవ్ సమక్షంలో సొంతగూటికి చేరారు. ప్రస్తుతం ఈ విషయంలో పట్టణంలో చర్చనీయాంశమైంది.

– షాద్‌నగర్



అరగంటలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరిన వెంకటేశ్ గౌడ్

నీళ్లిస్తేనే ఓట్లేస్తాం!



గౌలిపురా: మా బస్తీ ఓట్లు కావాలంటే.. తాగు నీరు, చేతిపంపు తదితర మౌలిక వసతులు కల్పించాలని గౌలిపురా మేకలమండి గాంధీనికేతన్ యువజన సంఘం కమిటీ పెద్దలు, బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం తరపున పోటీ చేస్తున్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు అభివృద్ధి పనులు చేస్తామంటేనే రండి అంటున్నారు. తమ బస్తీలో 4,300 ఓట్లు ఉన్నాయని.. అన్ని సౌకర్యాల సదుపాయాలు కల్పిస్తేనే మీ విజయం కోసం పాటుపడతామన్నారు. బస్తీవాసులకు ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా చేతిపంపు వేయించి నీటి వసతి సదుపాయం కల్పిస్తే కలకాలం మీరు పేరు గుర్తుంటుందంటూ ఓ బ్యానర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం.

ప్రతీ హామీ నెరవేరుస్తాం



ఎల్లకొండలో మాట్లాడుతున్న నేతలు

నవాబుపేట: కేసీఆర్ పాలనలో ఎవరు అభివృద్ధి చెందారో ప్రజలే గమనించాలని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీం భరత్ విమర్శించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గుబ్బడి పత్తేపూర్, ముబారక్పూర్, గంగ్యాడ, ఎల్లకొండ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీం భరత్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం పూటకు ఒక పార్టీ మారే వ్యక్తి అన్నారు. ఆయన వల్ల చేవెళ్లకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యాదయ్య నియోజకవర్గానికి ఏమి చేశాడో చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇస్తున్న ప్రతీ హామీ నెరవేరుతుందన్నారు. తనకు అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మధుసూదన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, సర్పంచ్‌లు రాములు, ప్రభాకర్ రెడ్డి, మండల నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కొండల్‌యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం సతీమణి ప్రమీల

షాబాద్: ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్.రత్నం సతీమణి ప్రమీల, కూతురు డాక్టర్ ప్రణీత ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని సీతారాంపూర్, బోడంపహాడ్, అప్పారెడ్డిగూడ, లింగారెడ్డిగూడ గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల అభివృద్ధిని విస్మరించిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న తుగ్లక్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు నారాయణ, శ్రీధర్‌రెడ్డి, రాము, మాణెయ్య, మహేశ్ తదితరులున్నారు.

'రాజేంద్రనగర్‌లో కమల వికాసం'

అత్తాపూర్: రాజేంద్రనగర్‌లో ఈసారి తమ గెలుపు ఖాయమని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అత్తాపూర్ హైదర్‌గూడలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ ఎన్నికల చిహ్నం కమలం వికాసంతోనే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పౌర సదుపాయాలను మెరుగుపరిచి ప్రజల జీవనం సుఖమయం చేయడమే తమ మొదటి ప్రాధాన్యమన్నారు. రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థను చక్కదిద్దే సమగ్ర ప్రణాళిక తన వద్ద ఉందన్నారు. పారిశ్రామిక వ్యర్థాలను కాలనీల్లోకి రానివ్వకుండా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. పారిశ్రామిక కార్మికుల పని స్థలాల్లో సరైన వసతులపై దృష్టి పెడుతానన్నారు. బీజేపీ నాయకులు నారగూడెం మల్లారెడ్డి, మోహన్‌రావు, సంగీత గౌరీ శంకర్, నాయకులు బొక్క బాల్‌రెడ్డి, సుల్తే వెంకటేశ్, ఆర్.సుధాకర్, కె.విజయ్ కుమార్, మణికంఠ, బాలకృష్ణ, సతీష్, పవన్‌యాదవ్, రాము, ఎం .శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ది అవినీతి పాలన



సమావేశంలో మాట్లాడుతున్న షమా మహ్మద్

ఏఐసీసీ డెలిగేట్ షమా మహ్మద్

తాండూరు: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబం అవినీతి పాలన కొనసాగుతోందని ఏఐసీసీ డెలిగేట్ షమా మహ్మద్ అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ఎస్‌వీఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబం అంతులేని అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ప్రభుత్వంలోని కీలక పదవులన్నీ ఆయన ఇంటి(కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు)కే పరిమితమయ్యాయని మండిపడ్డారు. దీంతో అడ్డు అదుపు లేకుండా అవినీతి చేశారన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు 15 కోట్లు ఆస్తి ఉండగా.. ప్రస్తుతం రూ.59కోట్లకు పెరిగిందన్నారు. మంత్రి కేటీఆర్‌కు గతంలో రూ.7 కోట్లు ఉంటే ప్రస్తుతం రూ.53 కోట్లకు, కేసీఆర్ కూతురు కవితకు రూ.6 కోట్లు ఉండగా తాజాగా 30 కోట్లకు చేరిందని వివరించారు. రూ.2 కోట్ల ఆస్తి ఉన్న హరీష్‌రావు ప్రస్తుతం రూ.30 కోట్ల ఆస్తి అధికారికంగా చూపించారని తెలిపారు. రూ.4కోట్లతో నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును రూ.105 కోట్లకు పెంచారని తెలిపారు. మేఘా నిర్మాణ సంస్థ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వాటాలు అందాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దశా బ్దాల క్రితమే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించిన చరిత్ర ఉందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మిన కర్ణాటక ప్రజలు అధికారం ఇచ్చారని, తెలంగాణలోనూ తమదే అధికారమన్నారు. బీఆర్‌ఎస్‌ను బొంద పెట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకమయ్యారన్నారు. అధికారంలోకి రాగానే రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఒకే ఇంట్లో 125 ఓట్లు

జాబితా.. తప్పుల తడక



సాక్షి, సిటీబ్యూరో : గ్రేటర్ పరిధిలోని ఈఆర్ఓల నుంచి బూత్ లెవల్ అధికారుల వరకు ఓటరు జాబితాలను పరిశీలన చేశారా? లేదా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఓటరు నమోదు నుంచి ఓట్ల తొలగింపు వరకు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు పలు రాజకీయ పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. మాదన్నపేట్‌లోని 123వ పోలింగ్ బూత్ పరిధిలో ఉన్న ఇంటి నంబర్ 17-1-181/ఏ/34లో 125 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. మలక్‌పేట్ నియోజకవర్గంలోని కాలాడేరా కమ్యూనిటీ హాల్ పోలింగ్ బూత్ (138) పరిధిలో ఉన్న ఒక ప్రభుత్వ క్వార్టర్స్‌లో 16-8-935) గతంలో 346 ఓటర్లు నమోదై ఉన్నారు. అధికారులు ఈ తప్పును సవరించినట్లే సవరించారు. కానీ ఇటీవల విడుదలైన జాబితాలో ఇంకా 146 ఓటర్లు మిగిలే ఉన్నారు. యాకుత్‌పురా, చార్మినార్, నాంపల్లి, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో ఒకే ఓటరు కనీసం అయిదుసార్లు నమోదై ఉన్నాడు. రెయిన్ బజార్‌లోని ఇంటి నంబర్ 17-1-374/హెచ్/బి/23 లో ఓ మహిళ పేరుతో ఏకంగా 14 ఓట్లు నమోదై ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఓటరు లిస్టులను పరిశీలించి బోగస్ ఓట్లు పడకుండా అరికట్టాలని రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల సంఘాన్ని కోరుతున్నారు.

సర్వేశా నీవే దిక్కు!

- జయాపజయాలపై అభ్యర్థుల సర్వేలు
- పార్టీలతో నిమిత్తం లేకుండానే..
- రంగంలోకి బీటెక్ విద్యార్థులు
- ప్రత్యర్థుల వ్యూహాలకు ప్రతివ్యూహాలు
- తటస్థ ఓటర్లే లక్ష్యంగా..

సాక్షి, సిటీబ్యూరో: వనస్థలిపురానికి చెందిన ఒక వ్యూహకర్త ఓ ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి గెలుపు అవకాశాలపై సర్వే చేపట్టారు. ఇందు కోసం సుమారు 60 మంది బీటెక్ విద్యార్థులను రంగంలోకి దించారు. కాలనీలు, బస్తీలు, డివిజన్‌ల వారీగా ఆ విద్యార్థులు కొద్ది రోజులుగా విస్తృతంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఓటర్లతో చర్చిస్తున్నారు. వివిధ వర్గాలకు చెందిన వారి అభిప్రాయాలను సేకరించి క్రోడీకరించారు. ఈ సర్వేల నుంచి రూపొందించిన నివేదికల ఆధారంగా సదరు అభ్యర్థి ఏయే వర్గాల్లో బలంగా ఉన్నారో, ఎక్కడ బలహీనంగా ఉన్నారో వ్యూహకర్త తేల్చిచెప్పారు. సాధారణంగా ప్రధాన పార్టీలు తమ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై పెద్ద పెద్ద సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకొని వ్యూహాలను రూపొందించుకుంటాయి. కానీ ఇప్పుడు అభ్యర్థులు సైతం తమ నియోజకవర్గాల్లో వ్యక్తిగతంగా ఇలాంటి సర్వేలను నిర్వహించుకుంటున్నారు. ఇందుకోసం రెండు, మూడు నియోజకవర్గాలను ఎంపిక చేసుకొని సర్వేలు నిర్వహించి వ్యూహాలను సిద్ధం చేసే వ్యూహకర్తలు కూడా వచ్చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ అధినాయకత్వం చేపట్టే సర్వేలకు తోడు ఈ తరహా సొంత సర్వేలపై సీరియస్‌గా దృష్టి సారించారు. కేవలం ఒంటెత్తు ప్రచారం కొనసాగించకుండా ప్రత్యర్థుల కదలికలను గమనిస్తూ ప్రచారాన్ని కొనసాగించేలా వ్యూహాలకు పదునుపెడుతున్నారు. ఇందుకోసం ఈ సర్వేలు ఎంతో దోహదం చేస్తున్నాయని ఒక పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకుడొకరు తెలిపారు. ఈ సర్వేల కోసం అభ్యర్థులు భారీ మొత్తంలోనే వెచ్చించడం గమనార్హం.

నా బలమేంటి.. బలహీనతలేంటి?

ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో అంతర్మథనం పెరిగింది. ఇప్పటి వరకు కొనసాగించిన ప్రచారాన్ని, గెలుపుపై ఉన్న ధీమాను సమీక్షించుకుంటూనే మరోవైపు బరిలో నిలిచిన వారి బలాబలాలను అంచనా వేస్తున్నారు. 'నేను గెలవాలంటే ఏం చేయాలి.. నా బలం ఏంటీ.. బలహీనతలేంటీ' అనే అంశాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ సర్వేలను నిర్వహించుకుంటున్నారు. ఇటీవల ఉప్పల్‌కు చెందిన ఒక పార్టీ అభ్యర్థి ఇదే తరహా సర్వే నిర్వహించారు. కొన్ని వర్గాల ప్రజలకు ఆయన దూరంగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. దీంతో ఆ వర్గాలకు చేరువయ్యేందుకు సదరు అభ్యర్థి దృష్టి సారించారు. ఇలా నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు సొంత సర్వేల ఆధారంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సర్వేలతో ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపాధి లభిస్తోంది. వ్యూహకర్తలు సైతం భారీ మొత్తంలోనే సొమ్ము చేసుకుంటున్నారు.

తటస్థులే టార్గెట్..

- సాధారణంగా ఏ ఎన్నికల్లో అయినా సరే బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రతి కాలనీకి, గల్లీకి నిరంతరం వెళ్లడం సాధ్యం కాదు. అదే సమయంలో ప్రతిచోటా ఓట్ల సంఖ్యను పెంచుకోవాలి. ఇందుకోసం ద్వితీయ శ్రేణి నాయకులపై ఆధారపడి ఓటర్లను చేరుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు అభ్యర్థుల అనుచరులే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బలమైన ఓటు బ్యాంకులను కాపాడుకొనేందుకు వ్యూహాత్మకంగా ప్రచారాన్ని కొనసాగిస్తూనే తటస్థులను టార్గెట్ చేస్తున్నారు. ఇందుకోసం కమ్యూనిటీల వారీగా ఓటుబ్యాంకులను కొల్లగొట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.
- 'ఏ డివిజన్‌లో, ఏ కాలనీలో, ఏ బస్తీలో ఉన్న ప్రజలు ఎటు వైపు ఆసక్తి చూపుతున్నారనేది ద్వితీయశ్రేణి నాయకులకే స్పష్టంగా తెలుస్తుంది. అదే సమయంలో తటస్థులెవరో తెలిసేది కూడా ద్వితీయశ్రేణి నాయకులకే. అందుకే ఓటర్లను ఆకట్టుకొనేందుకు, మెజారిటీ పెంచుకొనేందుకు తటస్థులకు చేరువ కావడం ఎంతో కీలకం' అని ఒక ప్రధాన పార్టీకి చెందిన నాయకుడు చెప్పారు.

ఓటు వేయడం మానుకోవద్దు

సెలబ్రిటీ కామెంట్

హైదరాబాద్ నగరంతో నాది ప్రత్యేక అనుబంధం. దక్షిణ భారతంలో నేను చాలా నగరాలు తిరిగినప్పటికీ, నా ఆత్మ హైదరాబాద్‌లో ఉన్నట్లుగా ఫీలవుతుంటాను. హైదరాబాద్ విశ్వనగరం కావడానికి చాలా స్కోప్ ఉంది. ఆ మార్గంలోనే వెళ్తున్నాం. అయితే.. నగరాన్ని మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆ శుభ్రతా ప్రమాణాలను పాటించాల్సిన బాధ్యత పౌరులుగా మన అందరిపై ఉంది. బాధ్యత గల పౌరులుగా ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి. మన భవిష్యత్‌కు భరోసా కోసం ఐదేళ్లకు ఒకసారి వచ్చే అవకాశం ఇది. ఓటు రూపంలో మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది. ఓటు వేయకపోతే బాధ్యతాయుత పౌరులనిపించుకోలేరు. ఒకవేళ మీరు ఓటు వేయాల్సిన నియోజకవర్గ అభ్యర్థుల్లో మీకు నచ్చనివారు ఉంటే నోటాకైనా ఓటు వేయండి. అంతేకాని.. ఓటు వేయడం మానుకోవద్దు.

– దినేష్ తేజ్ 'ప్లేబ్యాక్, హుషారు, అలా నిన్ను చేరి' సినిమాల హీరో